లేబర్ కోడ్లు కార్మికులకు మరణ శాసనం

- వాటి అమలును వెంటనే నిలిపేయాలి
- మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటం
- మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి
- కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల రాష్ట్ర సదస్సులో వక్తలు

అభివాదం తెలుపుతున్న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్ల నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"లేబర్ కోడ్లు కార్మికుల పాలిట మరణ శాసనాలు. అవి అమల్లోకి వస్తే ఈ దేశంలో ఉండే కార్మిక వర్గం యాజమాన్యాలకు బానిసలుగా మారే ప్రమాదం ఉంది. వాటిని అమలు జరపకుండా మోడీ సర్కార్పై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాల్సిన తరుణం ఆసన్నమైంది. ఈ క్రమంలో మే20న తల పెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి" అని వక్తలు పిలుపునిచ్చారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని మంగళవారం హైదరాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్ల ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ వక్తలను వేదికపైకి ఆహ్వానించగా, ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ సదస్సు ముసాయిదా తీర్మానం ప్రవేశ పెట్టారు. సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన సిఐటియు జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ కార్మిక వర్గాన్ని తుడిచి పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గాన్ని కాదని కేంద్రానికి మద్దతు పలుకుతున్న బిఎంఎస్ వైఖరిని క్షేత్ర స్థాయిలో ఎండగట్టాలని కోరారు. "లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే కార్మికులు యాజమాన్యాలకు బానిసలుగా మారే ప్రమాదముంది. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు, కార్మిక సంఘాలు కనుమరుగవుతాయి. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు హరించుకు పోతాయి. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే లేబర్ కోడ్లను అమల్లోకి తెస్తున్నారు. 12 గంటల పని చట్టబద్ధం చేస్తున్నారు. సామాజిక భద్రతా పథకాలకు నిధులు తగ్గిస్తున్నారు. ఈ దేశంలో సంపదను సృష్టించే కార్మిక వర్గ ప్రయోజనాలను కాదని కేంద్రంలోని బిజెపి సర్కార్ కార్పొరేట్లకు, పెట్టుబడి దారులకు వత్తాసు పలుకుతోంది. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను చరిత్రలో నిలిచి పోయేలా చేపట్టాలి. సింగరేణి, ఎన్టీపీసీ నుంచి మొదలుకుని కింది స్థాయి వరకు సంఘటిత, అసంఘటిత రంగంలోని కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి. కార్మిక సంఘాలు ఐక్యంగా సమ్మెను విజయవంతం చేయాలి" అని సాయి బాబు పిలుపు నిచ్చారు. ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ మాట్లాడుతూ లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న 1936 ట్రేడ్యూనియన్ చట్టం, 1936 వేతన చట్టం, 1946 ఇండస్ట్రియల్ చట్టం మొదలుకుని అనేక చట్టాలు కనుమరుగైపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలు పెంచాలని ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి లాంటి వారు మాట్లాడటం కార్మికులకు ద్రోహం చేయడమేనని అభిప్రాయపడ్డారు. ఐఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్డి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ దేశంలో మెజార్టీ ప్రజలైన కార్మికుల హక్కులను కొద్ది మంది కార్పొరేట్లు నిర్ణయిస్తున్నారని అన్నారు. చట్టాలు చేసే ప్రజాప్రతినిధులైన ఎంపిల్లో 80 శాతం మంది పెట్టుబడి దారులు, పారిశ్రామిక వేత్తలేనని గుర్తు చేశారు. ఫలితంగా కార్మికుల ప్రయోజనాల కోసం పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలకు ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 95 శాతం మంది కార్మికులు కనీస వేతనాలు లేకుండా పని చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ మే 20న తలపెట్టిన సమ్మె విజయవంతానికి కార్మిక సంఘాలన్ని ఐక్య కార్యాచరణతో ముందుకు పోవాలని సూచించారు. యాజమాన్యాలకు సమ్మె నోటీసులిచ్చేటప్పుడు గెలిచిన సంఘాలే కాకుండా రిజిస్టర్ సంఘాలను కలుపుకుని పోవాలని అన్నారు. టియుసిఐ ప్రధాన కార్యదర్శి కె.సూర్యం మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినా ఎందుకు పేదరికం పోలేదని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వలన కేవలం ఐదు శాతం మంది పెట్టుబడిదారుల వద్ద 70 శాతం సంపద కేంద్రీకృతం అయిందని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు కార్మిక, పేద ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎంఎస్ నాయకులు అమ్జద్ మాట్లాడుతూ లేబర్ కోడ్ల రద్దుకు ఐక్య కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ మాట్లాడుతూ దేశంలోని సహజ సంపదను కొల్లగొట్టి జిందాల్, అంబాని, అదానీలకు బిజెపి సర్కార్ కట్టబెడుతోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను చంపుతున్న కేంద్రం, భవిష్యత్లో ప్రజా ఉద్యమాలపై కూడా ఉక్కు పాదం మోపనుందని ఆందోళన వ్యక్తం చేశారు. టిఎన్టియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎంకె బోస్ మాట్లాడుతూ లేబర్ కోడ్ల అమలును కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఏఐయుటియుసి నాయకులు భరత్ మాట్లాడుతూ కార్మికుల పోరాటాన్ని పక్కదారి పట్టించేందుకు మతోన్మాదాన్ని బిజెపి ముందుకు తెస్తోందని ఆరోపించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ఎఐటియుసి ఉపాధ్యక్షులు విజయకుమార్ యాదవ్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ టియుసిఐ (ఎస్ఎల్ పద్మ), బిఆర్టియు (మారయ్య), ఐఎఫ్టియు(శివబాబు), టిఎన్టియుసి (శివబాబు) అధ్యక్షత వహించగా, ఎఐటియుసి నాయకులు నర్సింహ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్, ఐఎఫ్టియు నాయకులు ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోదండరెడ్డి

ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరగాలి

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెరగాలని రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి అభిప్రాయపడ్డారు. పైలట్ ప్రాజెక్టు కింద రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని గడ్డమల్లయ్య గూడెం, చౌదరిగూడ, మొండిగౌరెల్లి గ్రామాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఇప్పటికే అధికారులు ఆయా గ్రామాల్లో అధికారులు పనులు ప్రారంభించారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్లోని కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులు, అధికారులతో సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్టును విజయవంతం చేసేందుకు త్వరలో కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. రైతులను ఉద్యానవన పంటల వైపు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఆ పంటలకు రాయితీలపై యాత్ర పరికరాలు, బిందుసేద్యం పరికరాలను సమకూర్చుతామని వెల్లడించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, గడుగు గంగాధర్ తోపాటు మెంబర్ సెక్రటరీ గోవిందు వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్, నాబార్డ్ అధికారులు, కమిషన్ డీఏవో సంధ్యారాణి, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్, ఎన్జీవోల ప్రతినిధులు హాజరయ్యారు.

సమ్మేళన సభలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

భూ భారతి చట్టం.. రెవెన్యూకు కొత్త ఊపిరి

- ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం : లచ్చిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నూతనంగా అమల్లోకి రానున్న భూ భారతి చట్టం రెవెన్యూ వ్యవస్థకు కొత్త ఊపిరి పోయనుందని తెలంగాణ ఉద్యోగుల జెఏసి చైర్మెన్ వి లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రామకృష్ణ అధ్యక్షతన హైదరాబాద్లోని ఐఎఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చట్టంతో తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణమవుతుందని అభిప్రాయపడ్డారు. భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరగడంతో పాటు రెవెన్యూ సేవలు, పౌర సేవలు సులభతరమవుతాయని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కావడంతో రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని దీమా వ్యక్తం చేశారు. సర్కార్ గొప్ప లక్ష్యంతో చేపట్టిన ఈ చట్టం అమలుకు రెవెన్యూ ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం కోశాధికారి వెంకట్ రెడ్డి, టిజిటిఎ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, అసోసియేట్ అధ్యక్షులు చల్ల. శ్రీనివాస్, టిజిజిఎ సెక్రటరీ జనరల్ సెక్రటరీ పూల్ సింగ్, టిజిఆర్ఎస్ఎ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దర్శనం గౌడ్, టిజిటిఎ మహిళా విభాగం అధ్యక్షురాలు పి. రాధ, విఆర్ఒల సంక్షేమ సంఘం అధ్యక్షులు గరిక ఉపేంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే మనుగడ

హైదరాబాద్ బ్యూరో : ప్రజల్ని రక్షించాల్సిన రాజ్యాంగానికి ప్రమాదమేర్పడిందనీ, దాన్ని రక్షించుకుంటేనే మనకు మనుగడ ఉంటదని ఐఎఫ్ఎస్ అధికారి బిఎం వినోద్కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్లోని దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో 'రాజ్యాంగ పరిరక్షణ-భవిష్యత్ ప్రణాళిక' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకి డిఎస్ఎస్ జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం అధ్యక్షత వహించగా ఐఎఫ్ఎస్ అధికారి బిఎం వినోద్ కుమార్, ప్రొఫెసర్ వసుందరాదేవి, ప్రొఫెసర్ రజిత, డాక్టర్ సాధన, ఎస్సి,ఎస్టి అసోసియేట్ కార్యదర్శి శంకర్, ఎంవిఎఫ్ బాధ్యులు వెంకటరెడ్డి, సత్యవతి, ప్రకాశ్, కృష్ణకుమారి మాట్లాడారు. వినోద్కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవటానికి మేదావులు,హక్కుల సంఘాలు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా నడుచుకుని, ఎవరి వాటా వారికి అందేలా చూడాలన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరారు.

గ్యాస్ ధర పెంపును వ్యతిరేకిస్తూ నేడు ధర్నా

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచడం వల్ల మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు అయ్యిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ఖాళీ సిలిండర్లతో బుధవారం నిరసన ధర్నాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మేలు చేయడానికి రూ.500కే గ్యాస్ సిలిండర్లు ఇస్తూ ఉంటే కేంద్రం తన ఇష్టానుసారంగా ధరలు పెంచుకుంటూ పోతోందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు, బడా పారిశ్రామికవేత్తలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ ప్రజల మీద మాత్రం బారాలు మోపుతున్నదని ఆయన విమర్శించారు.

ధర్నా చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

ఒప్పంద అధ్యాపకులను అందర్నీ పర్మినెంట్ చేయాలి

- జిఓ 21ని రద్దు చేయాలి
- కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1270మంది ఒప్పంద అధ్యాపకులను రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా పర్మినెంట్ చేయాలని, జీవో నెంబర్ 21 వెంటనే రద్దుచేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ విశ్వవిద్యాలయం ప్రధాన పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏప్రిల్ 4న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 21ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయ అధ్యాపకుల సంఘం ఆందోళనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం అధ్యాపకులు తరగతులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ కర్ణాకర్ రావు, డాక్టర్ శ్రీధర్ కుమార్ లోతులు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని గతంలో అనేక సార్లు గత ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. ఈ విషయంపై ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి రాగానే అమలుచేయకపోగా జీఓ 21ని విడుదల చేసిందని అన్నారు. దీని వల్ల ఒప్పంద అధ్యాపకులకు ఎలాంటి లాభం చేకూరదని, దాన్ని వెంటనే రద్దు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు యూజీసీ సెవెంత్ పే బేసిక్, డిఎ, హెచ్ఆర్ఎ, 3 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. ధర్నా అనంతరం యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ.. మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఒప్పంద అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

234వ సిఆర్పిఎఫ్ బెటాలియన్ ఆధీనంలోకి సాగర్ డ్యాం

తెలంగాణ వైపు నుంచి వైదొలిగిన 39వ బెటాలియన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ డ్యాం భద్రత విషయంలో వారం రోజులుగా నడుస్తున్న హై డ్రామాకు మంగళవారం తెరపడింది. 2023లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాగార్జునసాగర్ డ్యాంపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఏర్పడిన వివాదం కారణంగా డ్యాం భద్రతా విధులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక పోలీసు దళాల నుంచి సిఆర్పిఎఫ్ కేంద్ర బలగాల ఆధీనంలోకి వెళ్లిపోయింది. డ్యాంపై 13వ గేటు వరకు తెలంగాణ వైపు 39వ సిఆర్పిఎఫ్ బెటాలియన్ బలగాలు, 13వ గేటు నుంచి 234వ సిఆర్పిఎఫ్ బెటాలియన్ బలగాలు విధులను నిర్వహించాయి. అయితే, కొన్ని రోజులుగా డ్యాం భద్రత విధులను గతంలోలా తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు దళాలకు అప్పజెప్పి తిరిగి వెళ్లనున్నాయని ప్రచారం జరిగింది. కొన్ని నెలల కిందట సాగర్ డ్యాం భద్రత విధుల నుంచి ఉదయం వైదొలిగిన 39వ సీఆర్పీఎఫ్ బెటాలియన్ ఒక్క రోజులోనే తిరిగి విధుల్లో చేరింది. నాలుగైదు రోజులుగా నాగార్జునసాగర్ డాం భద్రత విధుల నుంచి తాము వైదొలిగి వెళుతున్నట్టు.. దానికి సంబంధించి ఉత్తర్వులు వస్తున్నట్టు ప్రచారం జరిగింది. మంగళవారం సిఆర్పిఎఫ్ ఉన్నత స్థాయి అధికారుల నుంచి ఉత్తర్వులు రావడంతో నాగార్జునసాగర్ డ్యాం తెలంగాణ వైపు విధులు నిర్వహిస్తున్న 39వ సిఆర్పిఎఫ్ బెటాలియన్ తాము భద్రతా విధులు నుంచి వైదొలుగుతున్నట్టు ఇరిగేషన్ ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం రాత్రి వారి రవాణాకు సంబంధించిన వాహనాలు క్యాంపు కార్యాలయానికి చేరుకోవడంతో సాగర్ నుంచి వెళ్లిపోవడానికి సమాయత్తం అయ్యారు. అయితే, కేంద్ర బలగాలు సాగర్ డ్యాం భద్రతా విధుల నుంచి వైదొలిగిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు బలగాలైన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డ్యాంను తమ ఆధీనంలోకి తీసుకోవాల్సి ఉండగా, ఆంధ్ర వైపున భద్రతా విధులు నిర్వహిస్తున్న 234వ సిఆర్పిఎఫ్ బెటాలియన్ కేంద్ర బలగాల ఉన్నత స్థాయి అధికారుల ఉత్తర్వుల మేరకు తెలంగాణ వైపు కూడా అంటే నాగార్జునసాగర్ డ్యాంను పూర్తిస్థాయిలో తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. దీంతో నాగార్జునసాగర్ డ్యాం పూర్తిస్థాయిలో ఆంధ్ర ఆధీనంలోకి వెళ్లిందని ప్రచారం జరిగింది. ఈ విషయంలో కేంద్ర బలగాల అధికారులుగాని, స్థానిక ఇరిగేషన్ అధికారులుగానీ ఏమీ చెప్పలేకపోయారు. ఈ సందర్భంగా స్థానిక ఇరిగేషన్ అధికారులు మాత్రం నాగార్జున సాగర్ డాం నిర్వహణ తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖనే నిర్వహిస్తుందని చెప్తున్నారు. అయితే, కృష్ణా నది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) నిర్ణయం మేరకు నాగార్జునసాగర్ డ్యాంపై ఆంధ్ర వైపున భద్రతా విధులు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలే తెలంగాణ వైపు కూడా బాధ్యతలను నిర్వర్తిస్తాయన్నారు.

పేద, మధ్యతరగతి ప్రజలపై భారం వేయొద్దు

- వంటగ్యాస్ పెంపుపై నేడు, రేపు రాష్ట్ర వ్యాప్త నిరసనలు
- సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచడం దారుణమని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. పేద, మధ్యతరగతి ప్రజలపై భారం వేయొద్దని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వంటగ్యాస్ ధరల పెంపునకు వ్యతిరేకంగా బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించి ఆ ఫలితాలను అందించాలని తెలిపారు. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్పై రూ.50 పెంచడం దారుణమని విమర్శించారు. దీనివల్ల ఉజ్వల పథకం లబ్దిదారులు, సాధారణ వినియోగదారులతోపాటు, మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై కూడా పెద్ద భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను ఉపసంహరించుకోవాలనీ, దీనికోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన బిజెపి ప్రభుత్వం, అన్ని రకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్యాస్ సిలిండర్ ధరలు 130.57 శాతం పెంచడంతోపాటు, సబ్సిడీని కూడా తగ్గించుకుంటూ వచ్చిందని తెలిపారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలిస్తూ, రాష్ట్రంలోని వినియోగదారులపై ఏటా రూ.400 కోట్ల భారం మోపుతున్నదని విమర్శించారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టాలని పార్టీ శాఖలు, ప్రజలకు జాన్వెస్లీ విజ్ఞప్తి చేశారు.

మయన్మార్లో చిక్కుకున్న తెలంగాణ వాసులు

- చెర నుండి విముక్తి కల్పించాలని మహాముత్తారం మండల వాసుల విజ్ఞప్తి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలానికి చెందిన లావుడ్యా విజయ్, అజ్మీరా సంతోష్.. మయన్మార్ ఆర్మీ చేతిలో బందీలుగా ఉన్నారని, వారిని ఇండియాకు రప్పించాలని వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బాధిత కుటుంబ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. మహాముత్తారం మండలంలోని నిమ్మగూడెం, దొబ్బలపాడు గ్రామాలకు చెందిన విజయ్, సంతోష్.. గతేడాది డిసెంబర్లో బతుకుదెరువు కోసం థాయిలాండ్లోని మయన్మార్కు వెళ్లినట్టు తెలిపారు. అక్కడ ఒక నెల తర్వాత కావాలని వారితో సైబర్ క్రైమ్ చేయించి ఆర్మీకి అప్పగించినట్టు చెప్పారు. వారు ఆర్మీ ఆధీనంలో ఉన్నారన్న విషయాన్ని తమకు ఆలస్యంగా సమాచారం ఇచ్చారన్నారు. అక్కడ ఆరోగ్యం బాగాలేదని, తిండి లేక పస్తులు ఉంటున్నామని బాధితులు ఫోన్లో తెలిపినట్టు తెలిపారు. ఉపాధి కోసం వెళ్లిన ఇద్దరిని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర సిఎం రేవంత్ రెడ్డి చొరవ చూపి స్వగ్రామానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

11న ఎఐకెఎస్ వ్యవస్థాపక దినోత్సవం

- గ్రామ, గ్రామాన జెండా ఎగురేయాలి
- పోస్టర్ ఆవిష్కరణలో టి సాగర్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 89వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈ నెల 11న గ్రామ, గ్రామాన నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు.అన్ని గ్రామాల్లో రైతుసంఘం జెండా ఎగురవేయాలని కోరారు. మంగళవారం హైదరాబాద్లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ జిల్లా, మండల కేంద్రాల్లో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్ల నాయకులను ఆహ్వానించి సదస్సులు నిర్వహించాలన్నారు. అప్పటి దోపిడీ వలస, భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా పెరుగుతున్న పోరాటాల నేపథ్యంలో 1936 ఏప్రిల్ 11న లక్నోలో స్థాపించారని గుర్తు చేశారు. నేడు కిసాన్ సభ 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 1,46,88,354 సభ్యత్వంతో భారతదేశంలో అతిపెద్ద రైతు సంఘం అని తెలిపారు. ఐక్య రైతు ఉద్యమం, రైతు కార్మికుల ఐక్యతను నిర్మించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోందన్నారు. 'ప్రత్యామ్నాయం కోసం పోరాడుదాం...సంఘటితంగా ముందుకు సాగుదాం' అనే నినాదాలతో మహిళా రైతులు, యువ రైతుల గరిష్ట సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, రాష్ట్ర నాయకులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బార్ అండ్ రెస్టారెంట్లు నిబంధనలు పాటించాలి

- వాటికీ లైసెన్స్ జారీ చేయాలి
- వెంకటేశ్వరరావు, రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులు నిబంధనలు పాటిస్తూ వ్యాపారం చేసుకోవాలని తెలంగాణ వైన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రామచంద్రారెడ్డి అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్క్లబ్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. బార్ అండ్ రెస్టారెంట్ వారు బార్లు ప్రారంభించగానే రెస్టారెంట్ను మూసేసి.. 90, 180, 360, ఎంఎల్ పద్ధతి మానేసి పార్సిల్ ఇవ్వడం ప్రభుత్వ అనుమతులకు పూర్తి విరుద్ధమన్నారు. బాటిల్ ఓపెన్ చేసి తినడానికి కావలసిన ఆహార పదార్థాలు ఇచ్చి బార్ అండ్ రెస్టారెంట్లోనే సౌకర్యాలందించాల్సింది పోయి ఫుల్ బాటిళ్లు పార్సిల్ ఇవ్వడం వల్ల వైన్ షాపుల యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి బార్ అండ్ రెస్టారెంట్లకు కూడా లైసెన్స్ జారీ చేయాలని, అప్పుడే తాము పడుతున్న కష్టాలేమిటో వారికి తెలియవస్తాయన్నారు. ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 20,620 వైన్ షాపులుండగా, 1386 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయని తెలిపారు. తమ వ్యాపారం వల్ల ప్రభుత్వానికి 87 శాతం రెవెన్యూ సమకూర్చగా, బార్ అండ్ రెస్టారెంట్ల రెవెన్యూ 15 నుంచి 13 శాతమేనని స్పష్టం చేశారు. తాము పర్మిట్ రూములకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సుమారు రూ.5 లక్షల వరకు చెల్లిస్తున్నామని, లైసెన్స్ కోసం రూ.రెండు లక్షలు చెల్లిస్తున్నామని అన్నారు. బార్ అండ్ రెస్టారెంట్లకు కూడా అదే నిబంధన పెట్టాలని, అప్పుడే తమ కష్టాలు వారికి తెలియవస్తాయని అన్నారు. తమకున్న నిబంధనలే వారికి అమలు చేయాలని కోరారు. ఈ విషయంపై ప్రభుత్వాన్ని ఆబ్కారి శాఖను కోరడంతో పాటు త్వరలోనే ముఖ్య అధికారులను, మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఇప్పటికైనా బార్ అండ్ రెస్టారెంట్ల వారు నీతి నిజాయితీగా వ్యాపారాలు చేసుకోవాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, విక్రం, ప్రభాకర్, సుభాష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

2025 -26 అకడమిక్ నుండి పూర్తి స్థాయిలో కోడింగ్ కోర్సులు

- టిజిఎస్డబ్ల్యూఆర్ఇఐఎస్ కార్యదర్శి డాక్టర్ అలగు వర్షిణి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గురుకులాల్లో 2025-26 అకడమిక్ నుంచి 238 పాఠశాలల్లో పూర్తి స్థాయిలో కోడింగ్ కోర్సుల శిక్షణ ఇవ్వనున్నట్టు టిజిఎస్డబ్ల్యూఆర్ఇఐఎస్ కార్యదర్శి డాక్టర్ అలగు వర్షిణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు , వీలైనంత త్వరగా జీవితంలో మంచి హోదా , ఉజ్వల భవిష్యత్తుతో పాటు మంచి వేతనం ఉన్న ఉద్యోగాలవైపు ఇప్పటి యువత దృష్టి సారించిందని తెలిపారు. విద్యార్థుల అభిరుచు లకనుగుణంగా టిజిఎస్డబ్ల్యు ఆర్ఇఐఎస్ విద్యాసంస్థల్లో కోడింగ్పై శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. గతేడాది కేవలం ఒక్క మొయినాబాద్ పాఠశాలలో మాత్రమే ఈ కోడింగ్ శిక్షణ ఉండేదనీ, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విస్తరించేందుకు కృషి జరుగుతోందని పేర్కొన్నారు. ఈ శిక్షణకు లండన్కు చెందిన ఆర్పీఎఫ్తో ఐదేళ్లకు గాను గురుకుల సంస్థతో ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుందని తెలిపారు.

నోటీసు

మహారాజశ్రీ ముమ్మిడివరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A. 364/2023 in F.D.P. 2/2024 in O.S. 113/2019

Between:

దొంగ పద్మ -పిటీషనరు

మరియు

రాయుడు నాగవేణి, వగైరా -రెస్పాండెంట్లు

To:

1వ రెస్పాండెంట్: రాయుడు నాగవేణి, W/o. బాల నాగేశ్వరరావు, మియాపూర్ బస్ డిపో గేట్ నెం.1, మియాపూర్, హైదరాబాద్.

3వ రెస్పాండెంట్: బాలం అరుణ W/o. కృష్ణారావు, డో.నెం. 2-11, బ్లాక్ నెం.1, 2వ ఫ్లోర్, రాంకీ అపార్ట్మెంట్, IDPL, హైదరాబాద్

పై నెంబరు కేసులో పిటీషనరు గారు మీకు ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కనుక మీకు యీ ప్రకటన ద్వారా తెలియచేయునది ఏమనగా, సదరు పై వ్యాజ్యము **ది. 15-4-2025వ తేదీకి మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కనుక మీరు పై తేదీన పై కోర్టు వారు ఎదుట ఉదయం 10 గంటల 30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతిన)

జి.వి.రామారావు
అడ్వకేట్, ముమ్మిడివరం
సెల్: 9290286024

ముమ్మిడివరం
ది.08-4-2025

పిఎన్‌బి జోనల్ మేనేజర్‌గా సునీల్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) హైదరాబాద్ జోన్ జోనల్ మేనేజర్‌గా సునీల్ కుమార్ చుగ్ బాధ్యతలను స్వీకరించారు. చార్టర్డ్ ఎకౌంటెంట్ అర్హత కలిగిన చుగ్ బ్యాంకింగ్ రంగంలో మూడు దశాబ్దాలు పైగా విశేష అనుభవం కలిగి ఉన్నారు. వివిధ ప్రాంతాల్లోని పిఎన్‌బి కార్పొరేట్ శాఖలను నిర్వహించారు. చుగ్ నాయకత్వంలో హైదరాబాద్ జోన్ మరింత మెరుగైన ప్రగతిని కనబర్చనుందని ఆ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేశాయి.

నేషనల్ మార్ట్ లక్కీడ్రా విజేతల ఎంపిక

హైదరాబాద్ : ప్రముఖ రిటైల్ చెయిన్ నేషనల్ మార్ట్ ఇండియా ప్రకటించిన ఫెస్టివ్ ధమాకా లక్కీ డ్రాను ప్రకటించింది. తన నాగారం స్టోర్‌లో ఏర్పాటు చేసిన ఈ డ్రాలో మొత్తం 222 బహుమతులు ప్రదానం చేశారు. మెగా బహుమతిగా సరికొత్త కారును అందించినట్లు ఆ సంస్థ తెలిపింది. 13 మంది లక్కీ కస్టమర్లకు రిఫ్రిజిరేటర్లు, మరో 13 మంది విజేతలకు ఎసిలను అందించినట్లు నేషనల్ మార్ట్ వ్యవస్థాపకుడు యష్ అగర్వాల్ తెలిపారు.

కొత్త మద్యం బ్రాండ్లకు 604 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 604 కొత్త మద్యం బ్రాండ్ల అమ్మకాల అనుమతి కోసం 92 మద్యం సరఫరా కంపెనీలు దరఖాస్తులు చేసుకున్నాయని ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్. హరికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 23న దేశీ, విదేశీ మద్యం బ్రాండ్ల కోసం టీజీబీసీఎల్ దరఖాస్తులను ఆహ్వానించిందని తెలిపారు. ఏప్రిల్ 2న దరఖాస్తు గడువు ముగిసే సమయానికి 45 పాత కంపెనీలు 218 కొత్త రకాల మద్యం బ్రాండ్ల కోసం, 47 కొత్త కంపెనీలు 386 మద్యం బ్రాండ్లను తీసుక రావడానికి దరఖాస్తు చేసుకున్నాయని వివరించారు. దరఖాస్తుల పరిశీలిన అనంతరం కొత్త బ్రాండ్లకు ప్రభుత్వ ఆమోదం మేరకు అను మతి ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

బస్సు బోల్తా.. 15 మందికి గాయాలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం చింతగట్టు రింగ్ రోడ్డు బ్రిడ్జి వద్ద మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఒంగోలు నుంచి ఆదిలాబాద్ వెళ్లే లహరి బస్సుగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు సమాచారం.

ట్రాఫిక్ కానిస్టేబుల్ దుర్మరణం

- మియాపూర్‌లో లారీ బీభత్సం
- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మియాపూర్‌లో ఓ లారీ బీభత్సం సృష్టించిన ఘటనలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. మియాపూర్ ట్రాఫిక్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మెట్రో స్టేషన్ పిల్లర్ నెంబర్ 600 యూ-టర్న్ వద్ద నో ఎంట్రీ డ్యూటీల కోసం సోమవారం రాత్రి కానిస్టేబుళ్లు రాజ వర్ధన్, వికేందర్, సింహాచలం(45) విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం మోమిన్‌పేటకు చెందిన లారీ డ్రైవర్ కె శ్రీనివాస్.. లారీపై సోమవారం రాత్రి కూకట్‌పల్లి నుంచి మియాపూర్‌కు వస్తున్నారు. మియాపూర్ మెట్రో స్టేషన్‌కు చేరుకునే సమయంలో ఫిల్లర్ నంబర్ 600 వద్ద డ్రైవర్ వాహనాన్ని వేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతో లారీ అదుపు తప్పి అక్కడే ఉన్న ట్రాఫిక్ గొడుగును ఢీకొట్టింది. దాంతో అది ఎగిరి ట్రాఫిక్ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు సింహాచలం, రాజ వర్ధన్, వికేందర్‌పై పడింది. ఈ ఘటనలో సింహాచలం తలకు తీవ్ర గాయమైంది. మరో కానిస్టేబుల్ రాజవర్ధన్ కుడి భుజంలో ఫ్రాక్చర్ కాగా, వికేందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని వెంటనే మదీనాగూడలోని శ్రీకర ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం గచ్చిబౌలిలోని ఎఐజి ఆస్పత్రికి తరలించారు. కానిస్టేబుల్ సింహాచలం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు మియాపూర్ పోలీసులు తెలిపారు.

పాత పద్ధతినే అనుసరించాలి

- వర్సిటీల్లో పోస్టుల భర్తీలో లెక్చరర్‌గా అనుభవం అనే అంశాన్ని ఎత్తేయాలి
- నేరుగా నియామకాలు చేపట్టాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తెలిపింది. పాత పద్ధతిని అనుసరించి పోస్టులను భరీ చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చాలా కాలం నుంచి రాష్ట్రంలోని వర్సిటీల్లో అధ్యాపకుల నియామకాలు జరగలేదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో చివరిసారిగా నియామాలు జరిగాయని వివరించారు. అయితే ఈ సారి నిర్వహించే నియామకాల్లో మూడు దశల్లో ఉంటుందని ఉన్నత విద్యామండలి ప్రకటించిందని పేర్కొన్నారు. మొదటి దశలో విద్యార్హతల స్కోర్ ఆధారంగా 50 మార్కులు, రెండో దశలో అనుభవం తదితర అంశాలకు 30 మార్కులు, మూడో దశలో ఇంటర్వ్యూ కోసం 20 మార్కులుంటాయని ప్రకటించిందని వివరించారు. రెండో దశలో కేటాయించిన 30 మార్కుల్లో ఏదైనా డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకునిగా లేదా ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ కళాశాలలు, ప్రయివేట్ డిగ్రీ కళాశాలల్లో బోధించిన

అనుభవం 10 ఏండ్లు ఉంటే 10 మార్కులు, ఏడాదికి ఒక మార్కు ఆధారంగా 10 మార్కులు, పీడీఎఫ్ ఉంటే ఐదు మార్కులు, నెట్, సెట్ లేదా ఎంఫిల్ ఉంటే ఐదు మార్కులు అని ప్రకటించారని తెలిపారు. దీనిలో ప్రధానంగా ప్రభుత్వం అనుభవం అనే అంశాన్ని చేర్చడంపై పునరాలోచన చేయాలని కోరారు. బోధన, పరిశోధనలపై మక్కువతో పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న నూతన అభ్యర్థులకు ఈ నిబంధన అడ్డంకిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేటాయించిన 30 మార్కుల్లో 15 కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. అంటే 15 మార్కులకు మాత్రమే పోటీ పడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ అధ్యాపక వృత్తికి డోర్ స్టెప్ అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు కోసం బోధన అనుభవానికి అధిక మార్కులు కేటాయించడం సహజ న్యాయ సూత్రానికి వ్యతిరేకమని విమర్శించారు. స్క్రుటినీ అనేది మెరిట్ ఆధారంగా జరగాలనీ, కానీ, అనుభవం పేరుతో స్క్రుటినీ మొత్తం 80 మార్కులకు కాకుండా 30 మార్కులకు కుదించడం సరైంది కాదని తెలిపారు. జేఆర్ఎఫ్, ఇతర ఫెలోషిప్‌లు తీసుకుంటున్న వారికి బోధించే అనుభవం సాధారణంగా ఉండబోదని వివరించారు. ఫెలోషిప్‌లు పొందుతూ బోధన చేయడం కుదరదని పేర్కొన్నారు. కావున ఉన్నత విద్యామండలి ఈ నిర్ణయం తీసుకోవడం అంటేనే న్యాయ పరమైన చిక్కులు నోటిఫికేషన్‌లోనే సృష్టించినట్టు అవుతుందని తెలిపారు. యూజీసీ నిబంధనల ప్రకారం పీజీలో 55 శాతం మార్కులుంటే సరిపోతుందని పేర్కొన్నారు. కానీ డిగ్రీ మార్కులు కూడా పరిగణనలోకి తీసుకోవడం వల్ల నష్టం జరుగుతుందని తెలిపారు. యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కి ఈ నిబంధనలను జారీ చేశారని విమర్శించారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి జేఆర్ఎఫ్ వారికి ఒకే మార్కులు కేటాయించారని తెలిపారు. ఈ నిర్ణయం కూడా సరైంది కాదని పేర్కొన్నారు. గతంలో కేవలం అకడమిక్ రికార్డ్ అండ్ రీసెర్చ్ పర్ఫార్మెన్స్ స్కోర్, ఇంటర్వ్యూ ఆధారంగా మార్కులుండేవని గుర్తు చేశారు. కానీ కొత్తగా అనుభవం ఉండాలని చేర్చడం మూలంగా నిజమైన అభ్యర్థులు నష్టపోతారని తెలిపారు. ప్రభుత్వం కావాలనే న్యాయపరమైన చిక్కులు సృష్టించేలా ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. అనుభవం అనే అంశాన్ని తొలగించి నిజమైన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉన్నత విద్యామండలి ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆపరేషన్ కగార్‌ను ఎత్తేయాలి

- ఆదివాసులను రక్షించాలి
- మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు ప్రారంభించాలి
- రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు, మేధావులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆపరేషన్ కగార్‌ను ఎత్తేయాలని, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆదివాసీ జాతి హననాన్ని వెంటనే ఆపాలని ప్రజాసంఘాలు, హక్కుల సంఘాల నాయకులు, మేధావులు కేంద్రాన్ని కోరారు. గిరిజనుల జీవించే హక్కును పరిరక్షించాలని, మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్‌లో మంగళవారం సిపిఐ(ఎం) ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. దీనికి రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు, మేధావులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఆదివాసీలపై హత్యాకాండను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలని కోరారు. సమాజ మనుగడలో, అభివృద్ధిలో, వికాసంలో ఆదివాసుల పాత్ర ప్రధానమైనదిగా కేంద్ర, రాష్ట్ర పాలకులు ఇప్పటికైనా గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను అణచివేయాలని చూస్తే

ధర్నాలో మాట్లాడుతున్న వక్త

ప్రజాసంఘాలు చూస్తూ ఊరుకోబోవన్నారు.

ప్రొఫెసర్ రమా మేల్కొటే మాట్లాడుతూ.. మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత జెవి చలపతిరావు మాట్లాడుతూ.. మావోయిస్టులను అభివృద్ధి నిరోధకులుగా చూడడం, మాట్లాడటం సరికాదన్నారు. భూమి, ప్రజాస్వామ్యం, సమానత్వం కోసమే మావోయిస్టులు దశాబ్దాల తరబడి పోరాడుతున్న వాస్తవాన్ని గుర్తించాలన్నారు. నిజానికి పాలకవర్గ పార్టీలే హింసాకాండను తలపెడుతున్నాయన్నారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు సాదినేని వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, అరుణోదయ నాయకులు విమలక్క, ఆప్ కన్వీనర్ డ్రా.సుధాకర్, ప్రొ. కాశిం, సిపిఐ నాయకులు పశ్య పద్మ, సిపిఐ(ఎం-ఎల్) మాస్ లైన్ నాయకులు కె.రామా, ఎంసిపిఐ(యూ) నాయకులు మట్టయ్య, లిబరేషన్ నాయకులు రమేష్ రాజా, రెడ్ ఫ్లాగ్ నాయకులు రాజేష్, ప్రొ.గడ్డం లక్ష్మణ్, ప్రొ.వినాయక రెడ్డి, కన్నగంటి రవి, రాఘవాచారి, రవిచంద్ర, డా.కృష్ణ ప్రసాద్, విరసం నాయకులు రాంకీ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

భూకబ్జాలకు పాల్పడినట్టు నిరూపిస్తే.. రాజకీయ సన్యాసం చేస్తా : కడియం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తాను భూకబ్జాలకు పాల్పడినట్టు నిరూపిస్తే.. రాజకీయ సన్యాసంతో పాటు తన ఎమ్మెల్యే పదవికీ రాజీనామా చేస్తానని బిఆర్ఎస్ నాయకులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాటికొండ రాజయ్యకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ విసిరారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లా రాజేశ్వర్ రెడ్డి, రాజయ్య.. ఇద్దరూ కలసి రెవెన్యూ, అటవీ అధికారులను, రైతులను, మీడియా మిత్రులను తీసుకెళ్ళి ప్రజలందరి సమక్షంలో మీరే విచారణ చేపించండిని, మీ విచారణలో కడియం శ్రీహరి 2,000 ఎకరాలు కబ్జా చేశాడని తేలితే, తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మీ ఇళ్లలో గులాంగా పనిచేస్తానని తెలిపారు. నిరూపించకపోతే వారు తన ఇంట్లో గులామ్‌లుగా పని చేయాలన్నారు. ఈ సవాల్‌ను స్వీకరించండి, లేదంటే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ సవాల్, ప్రతిసవాళ్లు.. సోషల్ మీడియాలో హల్‌చల్ సృష్టించడంతో కడియం శ్రీహరి వర్గీయులు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాటికొండ రాజయ్య వర్గీయుల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో మండల ప్రజలు ఏది నిజమో, ఎంతవరకు ఎవరు ఎవరిది నిజమనేది తేల్చుకోలేక అయోమయానికి గురవుతున్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు పూనావాల ఫిన్‌కార్ప్ రుణాలు

ముంబయి : సైరస్ పూనావాలా గ్రూప్ ప్రమోట్ చేస్తున్న ఎన్‌బిఎఫ్‌సి సంస్థ పూనావాలా ఫిన్‌కార్ప్ లిమిటెడ్ (పిఎఫ్ఎల్) కొత్తగా షాప్‌కీపర్ లోన్ బిజినెస్‌ను ఆవిష్కరించింది. చిన్న రిటైలర్లు, కిరాణా దుకాణాలు ఎదుర్కొనే కీలక ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆ సంస్థ ఎండి, సిఇఒ అరవింద్ కపిల్ తెలిపారు. ఈ రుణాలు వారి నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు తోడ్పాటును అందిస్తాయన్నారు. తొలి దశలో 44 ప్రాంతాల్లో ఈ రుణాలను జారీ చేస్తామన్నారు.

జిఒ నెం 21ని రద్దు చేయాలి

- వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ అధ్యాపకుల ధర్నా
- తమను క్రమబద్ధీకరించాకే నియామకాలు చేపట్టాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిఒ నెం 21ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్ కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు తరగతులు బహిష్కరించారు. అనంతరం మహిళా విద్యాలయం (బ్రిటిష్ రెసిడెన్సి) దర్బార్ హాల్ వద్ద ఆందోళనకు దిగారు. జీఓ 21ను వెంటనే ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీరనారి చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయం కాంటాక్ట్ అధ్యాపకుల జేఏసీ కన్వీనర్ ఉపేందర్‌రావు మాట్లాడుతూ.. కొత్తగా అధ్యాపకుల నియామకాల కోసం ప్రభుత్వం ఇచ్చిన జీఓ 21ను రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 12 విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న 1270 మంది అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల సేవలను పూర్తి స్థాయిలో పర్యవేక్షించిన తర్వాతే మాత్రమే కొత్త నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో కాంట్రాక్ట్ అధ్యాపక డాక్టర్లు వినీత పాండే, రజిని, సనత్, రవి, సునీత, జ్యోతి, కృష్ణవేణి, కృష్ణాజి, శేఖర్‌రెడ్డి, ఆనంద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి డిఎన్‌ఎనే బిసిలకు, దళితులకు వ్యతిరేకం

- అసెంబ్లీలో జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలి
- బిసిల బిల్లుల ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలి : కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి డిఎన్‌ఎనే బిసిలకు, దళితులకు వ్యతిరేకమని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలపై వివక్ష కొనసాగుతోందని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. అసెంబ్లీలో జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ (యుపిఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనేవి కేవలం మాటల్లోనే ఉన్నాయన్నారు. దళిత నేత, రాజస్థాన్ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎమ్మెల్యే

ధర్నాలో మాట్లాడుతున్న కవిత

టికారాం జుల్లి ఇటీవల శ్రీరామనవమికి రాముడి గుడికి వెళ్తే గుడి మైలపడిందని సంప్రోక్షణ చేశారని తెలిపారు. అటువంటి దౌర్భాగ్యమైన పరిస్థితి దేశంలో ఉండటం దురదృష్టకరమన్నారు. బాన్సువాడ ప్రాంతంలో ఒక చాయ్ దుకాణంలో రెండు గ్లాసుల పద్ధతి ఉందని, బిసిలు, ఎస్సీలకు వేరే కప్పుల్లో చాయ్ పోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకే కాదు బీసీలకు కూడా ఇప్పటికీ అవమానాలు జరుగుతున్నాయని తెలిపారు. బిసిల కోసం ఎందుకు ధర్నాలు చేస్తున్నారని కొంత మంది ప్రశ్నిస్తున్నారని.. బీసీల సమస్యల పట్ల ఆవేశం, ఆవేదన నుంచి పుట్టికొచ్చినవే ఈ ధర్నాలు అన్నారు. ఈబ్ల్యూఎస్ అమలుతో 50 శాతం రిజర్వేషన్ పరిమితి తొలగిపోయింది కాబట్టి 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించినా కోర్టులు అడ్డుకోలేవన్నారు.

కర్ణాటకలో పదేండ్ల కిందట కుల గణన చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. ఈ ధర్నా శాంపుల్ మాత్రమేనని, అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. మీలా దొంగ దీక్షలు, దొంగ ధర్నాలు చేయబోమన్నారు. బిసి రిజర్వేషన్లపై న్యాయంగా పోరాడితే వారితో కలిసి పోరాటానికి సిద్ధమని తెలిపారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ ధూల్‌పేట్‌లో 102 కేసుల నమోదు

- 327 అరెస్ట్, 13 మంది బైండోవర్
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ కమలాసన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆపరేషన్ ధూల్‌పేట్ కార్యక్రమంలో 102 కేసులు నమోదు చేసి, 425 మందిని నిందితులుగా చేర్చామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఇందులో 327 మందిని అరెస్ట్ చేయగా, మరో 85 మంది తప్పించుక తిరుగుతున్నారని తెలిపారు. వారందరిని త్వరలో పట్టుకుంటామని పేర్కొన్నారు, అపరేషన్ ధూల్‌పేట ప్రారంభించిన 250 రోజుల్లో గంజాయి, డ్రగ్స్‌ను 90 శాతం అరికట్టామని తెలిపారు. భవిష్యత్‌లో ఈ ప్రాంత యువత మత్తు పదార్థాల అమ్మకం, రవాణా జోలికి పోకుండా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ధూల్‌పేట్‌లో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి దాడులు నిర్వహించామని తెలిపారు.

జిహెచ్ఎంసి పరిధి వరకు ఈ ఆపరేషన్‌ను విస్తరిస్తున్నట్టు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, హెచ్‌టిఎఫ్, డిటిఎఫ్ బృందాలను ఈ ఆపరేషన్‌ను నిరంతర పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు.

స్థానికులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్

శ్మశానవాటికలో చెత్త డంపింగ్

- దుర్గంధంపై హైడ్రాకు స్థానికుల ఫిర్యాదు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హిందూ శ్మశానవాటికను రామ్‌కీ సంస్థ కబ్జా చేసి అందులో చెత్త డంపింగ్ చేయడంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మచ్చబొల్లారం రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జెఎసి హైడ్రాకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో మచ్చ బొల్లారంలోని డంప్‌యార్డ్‌ను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నంబర్ 199లో మొత్తం 15.19 ఎకరాల స్థలాన్ని హిందూ శ్మశానవాటికకు కేటాయించగా, ఆ స్థలంలో రామ్‌కీ సంస్థ చెత్త డంపింగ్ చేయడాన్ని, అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. స్థానికులు కమిషనర్ పర్యటనలో పాల్గొన్నారు. మహిళలు కూడా వచ్చి సమస్యలు వివరించారు. ఇదే విషయంపై స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నుంచి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో సమస్యను పరిశీలించి, పరిష్కార మార్గాలు చూపాలని తనతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారని హైడ్రా కమిషనర్ మీడియాకు తెలిపారు. రామ్‌కీ సంస్థకు రెండెకరాల స్థలం కేటాయించినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అయితే, ఇక్కడున్న ప్రభుత్వ భూమి మూడు నాలుగు ఎకరాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించినట్టు చెప్పారు. తక్షణమే నిర్మాణాలను ఆపేయాలని రామ్‌కీ సంస్థను ఆదేశించామని, ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూస్తామని తెలిపారు. జనావాసాల మధ్య చెత్త డంపింగ్ యార్డును నిర్వహిస్తుండటంతో ఇబ్బందికర పరిసితులు నెలకొన్నాయన్నారు. చెత్త డంపింగ్ యార్డును తరలించాలన్న స్థానికుల ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కమిషనర్ చెప్పడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

డైరీ ఫామ్ చౌరాస్తాలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ స్తంభంపై విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి అంటుకొని రాజేంద్రనగర్ డైరీ ఫామ్ చౌరస్తాలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డైరీ ఫామ్ చౌరస్తా వద్ద సాయంత్రం ఒక స్తంభంపై రెండు విద్యుత్ తీగలు ఒకదానితో ఒకటి అంటుకొని ఉండటంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అధికారులు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సుమారు గంటపాటు మంటలు అలాగే చెలరేగాయి. తర్వాత విద్యుత్ అధికారులు మరమ్మతులు నిర్వహించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ ఘటనతో కొద్దిసేపు అక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు సకాలంలో అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

డిఎంఇకి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

మెడికల్ కాలేజీల్లో డెంటల్ డిపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయాలి

- ఆ విభాగాల్లో బోధనా సిబ్బందిని నియమించాలి
- డిఎంఇకి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్ని మెడికల్ కాలేజీల్లో డెంటల్ యూనిట్లను ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన బోధనా సిబ్బందిని నియమించాలని ఆల్ ఇండియా డెంటల్ స్టూడెంట్స్, సర్జన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మహమ్మద్ మంజూర్ అహ్మద్ నేతృత్వంలో మంగళవారం రాష్ట్ర వైద్యవిద్య సంచాలకునికి వినతిపత్రం అందజేశారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) మార్గదర్శకాల మేరకు ఈ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. బ్యాచ్‌కు వంద ఎంబిబిఎస్ సీట్లు కలిగిన ప్రతి మెడికల్ కాలేజీలో ఆ మార్గదర్శకాల మేరకు తప్పనిసరిగా ఒక ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక జూనియర్ రెసిడెంట్, నలుగురు డెంటల్ టెక్నీషియన్లు ఉండాలని తెలిపారు. బ్యాచ్ కు 250 ఎంబిబిఎస్ సీట్లు కలిగిన మెడికల్ కాలేజీలో అదే నిష్పత్తిలో బోధనా సిబ్బంది సంఖ్య పెంచాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో 38 ప్రభుత్వ మెడికల్ కాలేజీలున్నాయని, వాటన్నింటిలో గెజిట్ అయిన ఎన్ఎంసి మార్గదర్శకాల మేరకు డెంటల్ యూనిట్ల పనిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం జాతీయ ప్రమాణాలను అందుకునేందుకే కాకుండా విద్యార్థులు అన్ని రకాల ఆరోగ్య సంరక్షణ విద్యపై అవగాహన పెంచుకునేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. దీంతో భవిష్యత్తులో డాక్టర్లు నోటి అనారోగ్య సమస్యలను గుర్తించి వెంటనే సిఫారసు చేసేందుకు కూడా ఉపయోగపడుతుందని వివరించారు. ఈ యూనిట్ల ఏర్పాటుతో స్థానిక ప్రజలకు నోటి ఆరోగ్య సంరక్షణ సేవలు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇలాంటి సేవలు అందుబాటులోకి రావడం ద్వారా అందరికి సమాన ఆరోగ్యసేవల లక్ష్యం దిశగా అడుగులు పడతాయని చెప్పారు.